Acc. No. 3278

ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం.ఏ., పిఎచ్.డి.

మాడుగుల

ప్రవేశిక

ఇది విశాఖపట్టణ మండలమునందలి ప్రాచీనమైన కొండ జమీందారీలలో నొకటి. ఇందు 77 జిరాయితీ గ్రామములు, 26 అగ్రహారములు ఉండినవి. శాశ్వత పరిష్కారము నాఁటి పేష్కషు 30 వేలు. జమీందారీ రిపోర్టునాఁటి ఆదాయము రెండుంబాతికలక్షలకు పైమాట. పేష్కషు మాత్రము పెరుగలేదు. భూములు చాలసారవంతమైనవి. అయినను శీతోష్ణస్థితి అంత ఆరోగ్యకరమైనది కాదు*. ఈ సంస్థానమునఁ బ్రవహించు సీలేరు నది మీఁదఁగల మత్స్యకుండమను తీర్థమునందలి చేఁపలను సంస్థానప్రజలు అతి పవిత్రములని సంభావింతురు. మాడుగులకు పశ్చిమోత్తరదిశ యందుఁగల కొండల చాలులో నుండు పాడేరులో తమపూర్వులు మొదట మకాముచేసినట్లు ఈ సంస్థానము పాలకులు చెప్పుదురు. మొన్నమొన్నఁటిదాఁక ఈసంస్థాన పాలకుల పట్టాభిషేకోత్సవములు లాంఛనముగ తొలుత పాడేరునందే జరిగెడివఁట. మత్స్యాకృతిగల గద్దెయొకటి శిలానిర్మితమగునది నేఁటికిని పాడేరులోఁగలదఁట. వీరి ధ్వజములు మత్స్య లాంఛనముగలవి. ఈ జమీందారులు సంతకము చేయుటకుముందు మత్స్యాకృతిని లిఖించుటకూడ కద్దు. ఈ సంస్థానమునందు చిన్న చిన్న ముఠాదారు లెక్కువ. ఈ ముఠాదారులు ప్రజలనుండి శిస్తులు వసూలుచేసి తమ వాటాపోఁగా మిగిలినది జమీందారునకు చెల్లించెడివారు.

సంస్థాన చరిత్రము

ఈ సంస్థానపాలకులు పాండవుల సమీపబంధువులగు మత్స్యదేశ ప్రభువుల సంతతివారమని చెప్పుటకలదు. వాస్తవముగా అలనాఁటి మత్స్యదేశ ప్రభువుల సంతతికి చెందినవారో కారో స్పష్టముగా నిరూపించుటకు సరియైన చారిత్రకాధారములు లేవుగాని మత్స్యధ్వజములు, మత్స్యాకృతి గల గద్దెలు, సంతకము చేయుటలో మత్స్యాకృతిని లిఖించుటయు, సంస్థానపాలకులు మత్స్య కులము వారగుటయు, మత్స్యకుండమునందలి చేఁపలను పవిత్రముగా భావించుటయు మాత్రము ఈ సంస్థానపాలకుల విశిష్ట లక్షణములుగా గోచరించుచున్నవి. వీరు జయపుర సంస్థానము వారి కూటస్థునికి సన్నిహిత బంధువులనియు,

* మాడ్గులనీళ్ళు మానెడు గన్నుఁ పుచ్చుకుంటే జన్మం వున్నంతకాలమున్ను చలిజ్వరాలు వదలవు' (పూసపాటి రాజుల పూర్వోత్తరం).

ఆయనతోఁగూడ ఉత్తరదేశమునుండి ఈ దేశమునకు తరలివచ్చిరనియు, ఆయనకు ప్రతినిధిగా మాడుగులసీమకు పాలకుఁడుగా వీరిపూర్వుఁడొకఁడు 'భూపతి' యను బిరుదముతో నియమింపఁబడెననియు మఱియొక గాథ కలదు. వీరిపూర్వులు జయపురమువారికి సమీపజ్ఞాతులనుట మాత్రము ఇటీవలి సంబంధ బాంధవములనుబట్టి కూడ నిస్సంశయము. వీరిపూర్వులు జయపురము రాజన్యులకు నెమలిపింఛము పట్టెడివారఁట ! వీరి మూలపురుషుఁడు చోళభూపతిదేవు (721–771). క్రీ.శ. 771 నుండి 1700 వరకు ఇరువదియొక్కరు మాడుగులను పాలించిరఁట !

విజయనగరమువారిపై తిరుగుబాటుచేసిన కొండజమీందారులతోఁజేరి కుంఫిణీవారి సేనలతో తలపడినందున నాఁటి మాడుగుల జమీందారు లింగ భూపతిని మాడుగుల జమీందారీ యధికారమునుండి తొలఁగించుటకుఁగాను పూసపాటి సీతారామరాజు పెద్దయెత్తున ప్రయత్నములు సాఁగించినాఁడు. సీతా రామరాజు తమపై దండెత్తివచ్చినచో పరస్పరము సాయపడుటకు అనకాపల్లి జమీందారు పాయకరాయనింగారును, మాడుగుల లింగభూపతియును ఒడంబడికలు చేసికొనియుండిరి. కాని రణనీతినిపుణుఁడగు సీతారామరాజు వ్యూహరచనములముందు వీరియేర్పాటులు కొనసాఁగలేదు. విజయనగరము సర్వసేనాని పాగి నారాయణరాజు లింగభూపతిని పాఱఁదోలి మాడుగులను వశపఱచికొని అచట విజయనగరమువారి ఠాణా యేర్పఱచి తగు నధికారి వర్గమును నియమించి కట్టుదిట్టము గావించెను. లింగభూపతి చేయునదిలేక గోదావరి మన్యములకు వలసపోయి అచట మరణించెను.

1794 లో పద్మనాభయుద్ధమున విజయనగరము విజయరామరాజుగారు వీరమరణము పొందువరకు లింగభూపతివంశీయులు జయపురమునందే దీర్ఘ ప్రవాసము గడపిరి. ఆ తరువాత కొంతకాలమునకు విశాఖపట్టణమండలము కలెక్టరుగారు జయపురమునుండి వీరి కుటుంబమును రావించి లింగభూపతి సోదరుని కుమారులలో జ్యేష్ఠుఁడును, కృష్ణభూపతి తనూజుఁడును నగు జగన్నాథభూపతికి మాడుగులను మామూలు షరతులతో కవులున కిప్పించిరి. కాని చిరకాలము సాఁగిన యుద్ధాద్యుపప్లవములవలన దేశము చాలపాలు ఉజాడయియుండినది. ఉన్నప్రజలు కటికపస్తులతో కాలముగడపుచుండిరి. ప్రజలు లేరు, పనిలేదు; పంటలేదు, సంపదలేదు. దేశమెల్లెడల ఇనుప గజ్జెలతల్లి నాట్యము సేయుచుండినది.

సంస్థాన మిట్టి యిక్కట్టులలోఁ గొట్టుమిట్టాడుచుండఁగా లింగభూపతి పినతండ్రికి ఒక ఉంపుడుగత్తెవలన పుట్టిన కుమారుఁడగు అప్పలభూపతి యను నతఁడు జగన్నాథభూపతి సంస్థానపుహక్కును సవాలుచేయుచు పెద్దవివాదమును లేవఁదీసెను. ఆయనవాదము ప్రమాణబద్ధము, శాస్త్రసంబద్ధము కానందున

నిరాకరింపఁబడినవి. కాని ఆయన తనపట్టునువీడక ఏజన్సీప్రాంతములలో తన పక్షమును బలపఱచికొనుచు, వేలకొలఁది రూప్యములు జనులనుండి నయమునో, భయముననో జమచేసికొనుచు ప్రాంతగొడవకు వడసుపెట్టసాఁగెను. ఈ యింటిలోనిపోరు ఇట్లు పదునైదేండ్లపాటుసాఁగి జగన్నాథభూపతిని మిక్కిలి కలవరపఱచినది. అప్పలభూపతి మరణానంతరము అలెగ్జాండరువారుగారు విశాఖపట్టణమండలము కలెక్టరుగా నున్నప్పుడు జగన్నాథభూపతితో శాశ్వత పరిష్కారము జరిగినది. మాడుగులకు పట్టిన పీడ మాసిపోయినది.

జగన్నాథభూపతి యనంతర మాతని యౌరసుఁడు లింగభూపతి (క్రీ.శ. 1817—1831) మాడుగులను పాలించెను. లింగభూపతి యనంతరము ఆయన పెద్దభార్యయగు రామయ్యకు 1831 లో జమీ దఖలుపడినది. లింగభూపతికి పురుషసంతతి లేదు. జోగిమణిదేవి యను కూఁతురుమాత్ర ముండినది. ఈమె జయపూరు సంస్థానములోని కల్యాణసింగపురము ఎస్టేటుదారులు శ్రీ ముకుందదేవుగారిని వివాహమాడినది. జగన్నాథభూపతికి లింగభూపతి కాక, హరిహరభూపతి, కృష్ణభూపతి యని మఱి యిరువురు కుమారులుండిరి. లింగభూపతి 1831 లో మరణించుటచే సంస్థానము 1832 లో హరిహరభూపతికి సంక్రమించినది. హరిహరభూపతి సయితము నిస్సంతగుటవలన ఆయన మరణానంతరము ఆయనతమ్ముఁడగు కృష్ణభూపతి (1813—1875) 1853లో జమీందారయ్యెను.

1875 లో ఈ కృష్ణభూపతి మరణింపఁగా సంస్థానము 1886 దాఁక కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వశమున నుండినది. కృష్ణభూపతికి శ్రీ సీతాపట్టమహాదేవి, శ్రీ నీలమణిపట్టమహాదేవి యని యిరువురు భార్యలు. వీరిరువురు అక్కచెల్లెండ్రు; గుణుపుర రాజపుత్రికలు. సీతాపట్టమహాదేవిగారు 1886 లో జయపురసంస్థానము పెదదుగరాజుమహారాజులుంగారయిన కృష్ణచంద్రదేవుగారి నడిగి వారి కుమారులు శ్రీ విక్రమదేవవర్మ (1869--1951) గారిని ఏడేండ్ల బాలుని దత్తునిగా స్వీకరించిరి. ఈ దత్తస్వీకారము జయపురమువారికి సుతరాము ఇష్టములేదు. ఈ దత్తును కృష్ణభూపతి రెండవభార్యయగు నీలమణిపట్టమహాదేవిగా రాక్షేపించుచు నొక వ్యాజ్యము తెచ్చిరి. సర్వసాక్ష్యములను బరీక్షించి దత్తత చెల్లనేరదని ప్రీవీకౌన్సిలువారు 1889 లో తీర్పునిచ్చిరి. కాని, ఈ తీర్పు రాకముందే 1886 లో నీలమణిపట్టమహాదేవిగారు మరణించిరి. దత్తత చెల్లనికారణమున విక్రమదేవవర్మగారు మాడుగులనువీడి తల్లిదండ్రుల యొద్దకు తిరిగి వెడలిపోయిరి. 1876—1889 మధ్య సంస్థానము కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వశమున నుండినది. 1889 నుండి 1901 దాఁక సీతాపట్టమహాదేవిగారే ప్రీవీకౌన్సిలు తీర్పుమేరకు జమీందారిణిగా పాలించిరి. 1901 మే 4 వ తేదీన సీతాపట్టమహాదేవిగారు మరణించిరి.

రామచూడాంబాలింగభూపతుల తనయయును, కల్యాణసింగపురము ఎస్టేటు దారు శ్రీ ముకుందదేవుగారి భార్యయును నగు జోగిమణిదేవిగారికి మాడుగుల జమీ సంక్రమించినది. ఈమెకుమారుఁడు కృష్ణదేవు. ఈ కృష్ణదేవు నిస్సంతుగా మరణించుటచే ఆయనభార్య నీలాదేవి ముకుందదేవనునతనిని దత్తు తీసికొనెను. ముకుందదేవు మాడుగులకును వారసుఁడుగా గుర్తింపఁబడినాఁడు. కృష్ణభూపతి (1853—1875) ద్వితీయభార్యయగు నీలమణిపట్టమహాదేవిగారికి అమ్మి మహాదేవి యని యొక కూఁతురుండినది. ఈమె జయపురము మహారాజులు శ్రీ రామచంద్రదేవుగారి తమ్ములయిన విశ్వంభరదేవుగారి భార్య. అమ్మి మహాదేవి 1895 లో మరణించియుండినది. రాజేంద్రమణిదేవి వీరి కూఁతురు. ఈమెయును నిస్సంతగు వితంతువు. 1901లో మాడుగులను పై ముకుందదేవు, రాజేంద్రమణిదేవి యీ యిద్దఱకును పంపకము గావించిరి. 1905లో ముకుంద దేవు నిస్సంతుగా మరణించుటచే నాయనభార్య చంద్రమణిమహాదేవిగారు వారి వంతు జమీకి వచ్చిరి. 1931 ప్రాంతముల మాడుగుల జయపురము సంస్థానమున సంలీనమయి, ఉత్కలరాష్ట్రావతరణముతో చెన్నపురిరాష్ట్రమున శేషించి చిట్టచివరకు ఆంధ్రరాష్ట్రమున అంతర్భూతమయినది.

సాహిత్యపోషణము

మాడుగుల 'లింగభూపతి బహు ధర్మాత్ముఁడు. ఇటువంటి రాజు ఆ తాలూకాలో పుట్టబోడు. మాడ్గుల తాలూకాలో బ్రాహ్మణమాన్యాలు వసతిగా జరిగినట్లు మరివక తాలూకాలో లేదు'* అను ఏకైకోద్ధరణమునందలి ప్రశంస తప్ప కృష్ణభూపతి (క్రీ. శ. 1853—1875) కాలమువరకు ఈ సంస్థానమువారు కావించిన సాహిత్యపోషణమునకు నిదర్శనములు కానరావు. విజయనగర సామ్రాజ్యమునకు కృష్ణదేవరాయ లెట్టివారో మాడుగుల సంస్థానమునకు కృష్ణ భూపతి యట్టివారు. కృష్ణభూపతి సంస్కృతాంధ్రములలో గొప్ప పండితుఁడు. విద్వత్కవిబృంద పరిపోషకుఁడు. ఈయన కభినవకృష్ణదేవరాయలను దండి బిరు దుండినది. అడిదము బాలభాస్కరుఁడు, శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి, అల్లమరాజు రామకృష్ణకవి, ఇంద్రగంటి గోపాలశాస్త్రి, పేరి సర్వేశ్వరశాస్త్రి, మంత్రిప్రెగ్గడ సూర్యప్రకాశకవి మొదలగువారు కృష్ణభూపతి యాస్థానకవి పండితులు. పురాణం సూర్యనారాయణ తీర్థులు, భమిడిపాటి యజ్ఞనారాయణశర్మ, త్యాడి వేంకటశాస్త్రి, త్యాడి పట్టాభిశాస్త్రి మున్నగువారు ఆధునికకాలమునందు మాడుగుల మన్ననలనందిన విద్వత్కవులు.

అడిదము బాలభాస్కరకవి

అడిదము బాలభాస్కరుఁడు (1808—1874) అడిదము సూరకవి

* పూసపాటిరాజుల పూర్వోత్తరం.

(1720—1785) మునిమనుమఁడు. అడిదమువారి వంశమున బాలభాస్కర నామకులు మువ్వురు కలరు. మొదటి బాలభాస్కరకవి (1690—1750) సుప్రసిద్ధుఁడగు సూరకవీంద్రుని కన్నతండ్రి; ఇతఁడే శుద్ధాంధ్రరామాయణకర్త. రెండవ బాలభాస్కరుఁడు సూరకవి పుత్రుఁడు; పట్టి పండితపుత్రుఁడు. సూరకవి మనుమఁడగు సూరన (1778—1823)కు పుత్రుఁడగు మూడవ బాలభాస్కరుఁడు ప్రస్తుతచర్చలో ప్రసక్తుఁడు. మాడుగుల కృష్ణభూపతి బాలభాస్కర కవిని సమ్మానించినట్లు మాడుగుల సంస్థానాస్థాన కవీశ్వరుఁడగు మంత్రిప్రెగ్గడ ప్రకాశకవి రచించిన క్రింది చాటురచనము వలన నిరూపింపనగుచున్నది.

'పాగాకల కవు లిద్దఱు
బాగొందిరి కృష్ణమూర్తి భాస్కరులు మహా
భోగులు గవ్యనురాగులు
గోగణపాలకులు మాడుగుల సభలోనన్'

అడిదము బాలభాస్కరకవికి కృష్ణభూపతి వార్షిక మేర్పఱిచి గౌరవించెనఁట! విజయనగరము తాలూకాలోని రెల్లివలస బాలభాస్కరకవి నివాస గ్రామము. అడిదము వా రార్వేల నియోగులు. వసిష్ఠ గోత్రులు, ఆపస్తంబ సూత్రులు. బాలభాస్కరకవి పితృపాదులసన్నిధిని విద్యలనభ్యసించి సంస్కృతాంధ్రములందు సుశిక్షితుఁడై సరససాహిత్యపరిశ్రమము గావించినవాఁడు.*

బాలభాస్కరకవి రచించిన యుద్గ్రంథము లెవ్వియును లభ్యముకాలేదు. జానకీరామ భోగలింగ శ్రీ వేంకటేశ్వర సింహశైలనృసింహాది శతకములు, కొన్ని చాటురచనములు మాత్రము దొరకుచున్నవి. మాడుగులకు సంబంధించిన శ్రీ కృష్ణభూపతి తారావళి యను కందపద్య రచనముకూడ లభ్యమైనది. అశ్విన్యాది నక్షత్రనామము లిముడ్పఁబడిన యిరువదియేడు పద్యముల ఖండకావ్యమును తారావళియందురు. కృష్ణభూపతి తారావళినుండి మాదిరికి కొన్ని పద్యములు:

'శ్రీ మన్మృగరాజాశ్వని
సోమకళాభరణ గౌరి శుంభద్విభవ
స్తోమ మిడు నీకు శ్రితసుర
భూమిజ మత్స్యకుల కృష్ణభూపలలామా'
'వర రత్నాంచిత వలయా
భరణీతకరుఁడవగు నిన్నుఁ బ్రస్తుతిసేయన్
దరమా సత్కవివరులకు
సరసాగ్రణి! కృష్ణభూప! స్మరనిభరూపా!'

*అడిదము రామారావు, విస్మృత కళింగాంధ్ర కవులు, పుటలు 146—149.

'రేవతియను కాముని వసు
సేవింపఁగఁదలఁచు సుగుణశీలికి వసుధం
దై విలసిల్లెడు వానిం
భావించెదఁ గృష్ణభూప ! భావజరూపా !'

'తారావళియను కావ్యము
తారావళికరణిఁ గూర్చి తనరఁగ నీకున్
బేరుగ నొసఁగితి నిదిగోని
భూరికృపన్ బ్రోవు కృష్ణభూపతివర్యా !'

బాలభాస్కరకవియు నతని ప్రపితామహుఁడగు సూరకవియు [illegible]గ్రహ సమర్థుఁడఁట. ఇతఁడు చల్లా పట్టాభిరామయ యను [illegible] వెడఁదిట్టినట్లు ప్రతీతి[1].

శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి

మాడుగుల కృష్ణభూపతిచే సత్కరింపఁబడిన మఱియొక కవి శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి. ఈయన కాసలనాటి బ్రాహ్మణుఁడు[2]. వసిష్ఠ గోత్రోద్భవుఁడు. ఆపస్తంబ సూత్రపవిత్రుఁడు. గౌరమాంబా సర్వశాస్త్రులతనయుఁడు. జననము పిఠాపురము చెంతనున్న రావర్తి గ్రామము. తూర్పు గోదావరి మండలములోని రామచంద్రపురమునకు సమీపమునఁగల గొల్లపాలెమున కొంతకాలము కాఁపురము. బులుసు అచ్చయ శిష్యుఁడు. ఈయన సంస్కృతాంధ్రములలో పేరు పొందిన కవి. సంగీత సాహిత్యముల సమానప్రతిభకల పండితుఁడు. అభినవభట్టుమూర్తి యన్నది యాతని బిరుదు. పిండిప్రోలు లక్ష్మణకవికి ప్రశిష్యుండట్టి యని చరిత్రకారుల నిర్ధారణము. కాళహస్తి, పిఠాపురము, బగ్గంపేట, కోటరామచంద్రపురము మున్నగునితరసంస్థానములలోఁగూడ సమ్మానము లందినవాఁడు.

నాటకదీపము, పంచతంత్రము, వసుచరిత్ర వ్యాఖ్యానము, సింహాద్రి మాహాత్మ్యము, వేంకటాచల మాహాత్మ్యము, సర్వకామదా పరిణయము, శ్రీ నీతిశాస్త్రము, హనుమచ్ఛతకము మొదలైన యాంధ్ర గ్రంథములును, అశ్వశాస్త్రము, రామాయణ కథాత్మకమగు కంకణబంధము, జగన్నాథక్షేత్ర యాత్రా చరిత్ర పరమైన నీలశైలనాథీయము, మదనాభ్యుదయ యశోల్లాస పల్లవీపల్లవోల్లాసభాణములు, బాలవ్యాకరణమునకు ననువాదరూపమగు [illegible] కారికావళి మున్నగు ప్రసిద్ధగీర్వాణభాషాకృతులేగాక శతాధికములగు చాటువులు,

1 వేటూరి ప్రభాకరశాస్త్రి, చాటుపద్యమణిమంజరి, పు. 172 ; అడిదము సూరకవి జీవితమునకు నిడుదవోలువారి పీఠిక, పు. 10.

2 తెలగాణ్య వైదికబ్రాహ్మణుఁడని ఆంధ్రకవిసప్తశతి, పు. 40.

దండకములు, మాలికలు, స్తోత్రములు అనేకములు కృష్ణమూర్తిశాస్త్రి కృతము లనేకములు కలవు. మాడుగులలో సాలీనా వేయిరూప్యముల రాఁబడిగల మాన్య ములఁబడసి వారి యాస్థానమునఁ గవిపండిత శిరోభూషణమై యలరారి మాడుగులలోనే పరమపదించిరి.

కృష్ణభూపతి మీఁద కృష్ణమూర్తిశాస్త్రిగారు చెప్పిన చాటు వొకటి అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి సంకలితమగు చాటుధారాచమత్కారసారమునందు సంగ్రహితము యయున్నది. అది ఇది :

'శ్రీకృష్ణభూపకీర్త్యవసర గిరి గరిసరిసమేతి వీణేయమ్
బ్రూతే తత్తాత హితాధికతా కథితేతి మురజోను'

శ్రీ కృష్ణభూపతి కీర్తి యొక్క ఉచ్చారణసమయవాక్య విషయమునందు ఈ వీణ (గరిసరిః) నాగభూషణునితో సమానమని పలుకుచున్నది. ఈ మృదంగము కృష్ణభూపతి కీర్తి సరస్వతికంటె ఆధిక్యము కలదని చెప్పుచున్నది. శ్రీ కృష్ణ భూపతి నామ్నోరాజ్ఞః కీర్తేః; అవసరగిరి : ఉచ్చారణ సమయ వాక్య విషయే : ఇయం వీణా : తత్సభాయాం పరిదృశ్యమానా పల్లకీ; గరమేషా మస్తీతి గరిణ స్సర్పాః : తే సరాణి మాల్యాని యస్యసః గరిసరి : : శివః, తేన సమాః ఇతి బ్రూతే : ధవళత్వా దీశ్వర తుల్యేతిభావః; మురజః : మృదంగః : తత్తాతస్య : బ్రహ్మణః, కస్మింస్చిత్కాలాంతరే శివః బ్రహ్మ లలాట సముద్భవ ఇతి విష్ణుపురాణ శ్రవణాత్, తస్య బ్రహ్మణః హితా : సరస్వతీ : తస్యాః అధికతా సరస్వత్యావ్యతిరాయితా కథితా ఇతి బ్రూతే.

సంగీతశాస్త్రసంప్రదాయములను జోడించి రచించిన యీ చాటువు చమత్కారచారుతుగా నున్నది.

అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి

'ఏమేటి మాడ్గుల కృష్ణభూపాలుని
సభయందుఁ గవులచే శ్లాఘనందె' (ఆంధ్ర చంపూభారతము, 1—33).

మాడుగులవారి మన్ననలను పొందిన మఱియొక కవి అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి (1831—1892). ఇతనిది ఆరామ ద్రావిడశాఖ. గంగమాంబా రంగధామార్యుల పుత్రుఁడు. 'పీఠపురవర సమీపస్థ చేఁబ్రోలు నామ సంవసధ వాసుఁడు', 'ఉభయభాషాకవిత్వ విలసితుఁడు'. కృష్ణభూపతి కంకితముగా ప్రత్యక్షరశ్లేష పద్యావళిని రచియించెను. 'ప్రత్యక్షరి శ్లేషపద్యాళి మాడ్గుల కృష్ణ భూపతి సభం గీర్తిఁగంటి' (శ్రీకృష్ణకల్యాణము, పు. 4). 'మత్స్యకులదీప దిగ్విమస్మన్మనోరూప వరమగుణధామ కృష్ణభూపతిలలామ' యను మకుటముతో రచించిన సీసపద్యశతకము 1853 లో రచించి కృష్ణభూపతికి సమర్పించెను. 1853 నుండి 1869 దాఁక వీరికి మాడుగులలో నాశ్రయము లుండినవి.

'బొండుమల్లెలకు సమ్మోహనసౌగంధ్యంబు
చెఱకుఁగోలకు సమంచితమధురిమ
కంఠీరవమున కుగ్రప్రభావసమృద్ధి
యంచకుఁ బాలు నీ రెంచు నేర్పు
గండుఁగోయిలకుఁ జక్కని కలధ్వనిలీల
ప్రహ్లాదునకు హరిభక్తినియతి
మలయానిలమునకు లలితశీతలవృత్తి
వాణికిఁ ప్రాచుర్యవర్తనంబు
నీకు వితరణశీలంబు లోకమెల్లఁ
బొగడుచుండఁగఁ దోఁచనె పుట్టె నౌర
మత్స్యకులదీప! దివ్యమన్మథసురూప!
పరమగుణధామ! కృష్ణభూపతిలలామ!'

అని సుబ్రహ్మణ్యకవి వర్ణించిన తీరు కృష్ణభూపతిపట్ల స్వభావోక్తియుక్తమని పండితకోటి సంభావించుచున్నది.

అల్లమరాజు రామకృష్ణకవి

అల్లమరాజు సుబ్రహ్మణ్యకవికి సపతియున్నయగు అల్లమరాజు రామకృష్ణకవి కూడ మాడుగుల కృష్ణభూపతిని దర్శించి సత్కారము లందినవాఁడు. ఇతఁడు దక్షారామ భీమేశపదభక్తుఁడు. అచ్చతెలుఁగుభాగవత అధ్యాత్మ రామాయణ కవిచకోరచంద్రోదయ గౌతమీమాహాత్మ్య ద్రౌపదీపరిణయ మదాలసాపరిణయ వైనతేయవిజయ శంతనువిలాస సత్యభామావిలాస సుకవిజనమనోరంజన సుశోభాపరిణయ హనుమదాఖ్యానాది కావ్యనిర్మాత. రామకృష్ణీయ మన్నది యాంధ్రశబ్దచింతామణికి రామకృష్ణకవి సంతరించిన వ్యాఖ్యానము.

మంత్రిప్రెగ్గడ సూర్యప్రకాశకవి

మాడుగులసంస్థానాస్థాన పండితకవులలో మంత్రిప్రెగ్గడ సూర్యప్రకాశకవి (1808–1873) ముఖ్యులు*. ఈయన ఆర్వేల నియోగి, హరితసగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, సీతమా శరభసల పుత్రుఁడు. ఆఱాశ్వాసములు గల సీతారామచరిత మను ప్రబంధము, సుభద్రాపరిణయ పారిజాతాపహరణ కథలు రెండును జోడింపఁబడిన కృష్ణార్జున చరిత్ర మను ద్వ్యర్థికావ్యము, 'భీమలింగ కలుషవిభంగా' యను మకుటముగల నూఱు కందపద్యములు గల భీమలింగ శతకమును ఈ కవికృతులు.

* గిడుగు సీతాపతి, పంతులుగారి సమకాలికులు — యుగపురుషుఁడు వీరేశలింగం, శ్రీ కందుకూరి వీరేశలింగ స్మారకోత్సవసంచిక, పు. 177.

'చెలు వెసఁగ రాజసభలన్
బలుకని చదువేల బుధులు బాసిన యూరున్
కలిగియు లేని ధనంబడు
కలకంఠధర భీమలింగ కలుషవిభంగా' ---భీమలింగశతకము.

కృష్ణభూపతిమీఁద ప్రకాశకవి చెప్పిన కొన్ని చాటువు లిట పరిశీలింపఁ దగినవి :

'కృష్ణభూపతి సంకాశం కృష్ణభూపతి సన్నిభమ్
కృష్ణభూపతి నీకాశం కృష్ణభూపతి సద్యశః'

కృష్ణభూపతి సద్యశః : మాడుగుల సంస్థానాధిపతేః శ్రీకృష్ణ భూపాలస్య కీర్తిః. కృష్ణభూపతి సద్యశము పాలకడలివలెను, సరస్వతివలెను, గంగానదివలెను ఉన్నదని నానార్థములనుబట్టి సమన్వయము. మఱియొక చాటువు :

'విక్రమేఽర్జునముఖాః కృష్ణభూపాల తే హితాః
విక్రమేఽర్జునముఖాః కృష్ణభూపాల తేఽహితాః

హే కృష్ణభూపాలా! విక్రమమునందు పాండవమధ్యమాదులు నీకు హితులు. నీ ప్రతాపమువలని పరాభవ దైన్యముచేనైన ధవళవదనులు నీ అహితులు అని తాత్పర్యము.

ఇంకొక చాటువు :

'చేతులే గోతులే బాలే కాకులే వానముక్కులే
రుచిం పశ్యామి సుశ్యామే కచానాం తవ మంజులామ్'

చేతులే : హే లక్ష్మీసమానే, గోతులేచ : సరస్వతీసమానే, సుశ్యామే బాలే, తవ కచానాం : కుస్తలానామ్, మంజులామ్ : మనోహరామ్, రుచిమ్ : కాన్తిమ్. వానముక్కులే : వానముచః మేఘాః, తేషాం కులే : సముదాయే, కాకులేచ : వాయస కులేచ పశ్యామి. ఇందలి ప్రథమపాదమునందలి పదములు తెలుఁగుమాటలేమో యను భ్రాంతిని కలిగించుచున్నవి.

పేరి సర్వేశ్వరశాస్త్రి

సర్వేశ్వరశాస్త్రిగారు మాడుగులసంస్థానాధీశ్వరుల ఆహ్వానముమీఁద మాడుగులపండితులుగా నుండిరి. సంస్థానాధీశ్వరు లిచ్చిన మాన్యములు పెదనందిపల్లి ముఠాలో నున్నందున శాస్త్రిగారు దేనాడ వసతిగా నుండిరి. శ్రీ శాస్త్రిగారి సంతతికి చెందినవారే పేరి వేంకటేశ్వరశాస్త్రిగారు.

ఇంద్రగంటి గోపాలశాస్త్రి

ప్రసిద్ధ వ్యాకరణశాస్త్రవేత్తలగు ఇంద్రగంటి గోపాలశాస్త్రులు మాడుగుల ఆస్థానపండితులు. చిలుకూరి చతుష్టయములో మొదటి యిద్దఱయిన సోమనాథ

శాస్త్రి, పావనశ్యశాస్త్రి రామునిని పూర్తిచేసిన తరువాత శ్రీ గోపాలశాస్త్రిగారి యొద్దనే వ్యాఖ్యానగ్రంథములను పఠించిరి.

'శ్రీ మాడుగుల కృష్ణభూపతి.... మొదలగు మహాప్రభువుల మార్గమునఁ బ్రస్తుతము పీఠికాపురాధీశ్వరులు విద్యాగౌరవమును నిలుపఁ బండితపరీక్ష లుంచి ప్రయత్నించుచున్నారు' అను ఆంధ్రవాఙ్మయచరిత్రకారుల ప్రస్తుతి కృష్ణభూపతిపట్ల ప్రత్యక్షరసత్యము*.

* వంగూరి సుబ్బారావు, ఆంధ్రవాఙ్మయచరిత్రము. ద్వితీయముద్రణము, పుటలు 110, 111.

ఉపజీవ్య గ్రంథసూచి

1. కందుకూరి వీరేశలింగముపంతులు, ఆంధ్రకవుల చరిత్రము, తృతీయభాగము, పుటలు 95—110, 312—315, 317—324.
2. కందుకూరి బాలసూర్యప్రసాదరావు, ఆంధ్రవిజ్ఞానము, సంపుటము 1, పు. 180 ; సంపుటము 5, పు. 2345 ; సంపుటము 6, పుటలు 3206—3208.
3. వంగూరి సుబ్బారావు, శతకకవుల చరిత్రము.
4. విశాఖపట్టణముజిల్లా వృత్తాంతసంగ్రహము, పుటలు 529—533.
5. అడిదము రామారావు, విస్మృత కళింగాంధ్రకవులు, 1940, పుటలు 46—53; 146—149.
6. కవికొండల వేంకటసత్యనారాయణమూర్తి, విశాఖమండలచరిత్రము, పుటలు 118, 119.
7. చాటుధారా చమత్కారసారము, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవిసంకలితము, పుటలు 38, 39.
8. అడిదము రామారావు, అడిదము సూరకవిజీవితము, వావిళ్ళ, చెన్నపురి, 1955.
9. A. Vadivelu, The Aristocracy of Southern India, Vol. II, pp. 196–200.